## క్లుప్తంగా

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు సచివాలయ పరిధిలో రెండో రోజు గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండల అధికారులతోపాటు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చినగంజాం: కడవకుదురులో గ్రామంలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీలుసు బుధవారం ఉదయం పట్టుకున్నారు. ఎస్‌ఐ కట్టా అనూక్ తెలిపిన వివరాలు ప్రకారం కడవకుదురులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ డ్రైవర్, యజమాని ఆరిగ తిరుమలరావును అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

### గ్రానైట్ వాహనాలు స్వాధీనం

మార్టూరు: అక్రమంగా గ్రానైట్ శ్లాబులను తరలిస్తున్న రెండు లారీలను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె. కమలాకర్ బుధవారం తెలిపారు. స్థానికంగా ఓ గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న రెండు వాహనాలను ఎస్‌ఐ కమలాకర్ తమ సిబ్బందితో కలిసి జాతీయ రహదారి పై తనిఖీ నిర్వహించారు. అందులో భాగంగా ఎలాంటి అనుమతులు కానీ, బిల్లులు కానీ లేనందున రెండు లారీలను పోలీసు స్టేషన్‌కు తరలించి సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.వీటి విలవుసుమారురూ.6లక్షలని తెలిపారు.

### షటిల్ క్రీడాకారుడికి అభినందనలు

చీరాల: ఈ నెల 2 నుంచి 5 వరకు ప్రొద్దుటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చీరాలకు చెందిన క్రీడాకారుడు తుపాకుల నాగేశ్వరరావు 70 సంవత్సరాల వయస్సులో విశేష ప్రతిభచూపి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. బుధవారం చీరాల ఇండోర్ స్టేడియంలో నాగేశ్వరరావును రోటరీక్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాబూరావు, షటిల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. 70 ఏళ్ల విభాగంలో ఉత్తమ ప్రతిభ చూపి.. యువ క్రీడాకారులకు సైతం తుపాకుల ఆదర్శంగా నిలిచారన్నారు. మార్చిలో గోవాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభచూపి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, డాక్టర్ శంకరరెడ్డి, బి.మోహనరావు, నాగరాజు, సత్యనారాయణ, రాజు తదితరులున్నారు.

### 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల హర్షం

పర్చూరు: రాష్ట్రంలో 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలపడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జా సరేష్, దండమూడి శాంతారావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థపై ఎనలేని కృషి చేస్తున్నారని, గత 30 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న వారికి ఇది తీపి కబురన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీసుకొని వెళుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపారు. పోస్టులను భర్తీ చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ టి.కల్పలతా రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

### న్యాయవాదులకు సౌకర్యాలు

చీరాల రూరల్: న్యాయవాదులకు ఏవిధమైన అసౌకర్యం లేకుండా స్థానిక ఏడీజే కోర్టుతో అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ఉన్నత న్యాయస్థానానికి విన్నవిస్తామని ఆంధ్ర ప్రదేశ్ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కె. రామ జోగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన చీరాల విచ్చేసిన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాగంటి జ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు కరేటి రవికుమార్ రెడ్డి, తాటికొండ సాయిబాబు, బండారుపల్లి హేమంత కుమార్, ఎంవి. చలపతిరావు, కొమ్మనబోయిన నాగేశ్వరరావులు న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చీరాల కోర్టుల్లో అధిక సంఖ్యలో కేసులున్నాయని అదనపు కోర్టు ఏర్పాటు అవసరం ఉందన్నారు. అలానే 41 ఏ స్టేషన్ బెయిల్ వలన న్యాయవాదులకు అన్యాయం జరుగుతోందని, పోలీసులు ముద్దాయిలకు స్టేషన్ బెయిల్ ఇవ్వడం వలన కక్షిదారులకు, ముద్దాయిలకు న్యాయవ్యవస్థపై ఏ మాత్రం గౌరవం ఉండడంలేదని, తక్షణమే 41 ఏను రద్దు చేయాలని విన్నవించారు. అలానే కొత్తగా న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకునే సందర్భంలో 35 ఏళ్లు దాటిన న్యాయవాదికి వెల్ఫేర్ ఫండ్ వచ్చే అవకాశం లేదని దీంతో ఎంతోమంది నిరాశకు గురవుతున్నారన్నారు. 36 ఏళ్ల వారికి కూడా వెల్ఫేర్ ఫండ్‌కు అవకాశం ఇవ్వాలని విన్నవించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ నీలి కస్తూరినాథ్, సభ్యులు మేరుగ రవికుమార్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి

● గృహసారథులు, వలంటీర్ల సమీక్షలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. బుధవారం స్థానిక రోడ్డులోని డ్వాక్రా బజారులో 18వ వార్డు నుంచి 35వ వార్డు వరకు ఉన్న గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు వస్తున్నాయన్నారు. గతంలో రెకమండేషన్ ఉంటేనే ప్రభుత్వ పథకాలు వచ్చేవని, నేడు మన ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని వివరించారు. పరిశీలకులు హబీబుల్లా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల లాంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి మళ్లీ జగనన్నకు ఓటు వేయాలని కోరాలన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ గృహసారథులపై కీలక బాధ్యతలు ఉన్నాయని, అందరూ సమన్వయంతో పనులు చేయాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు పత్తి రవిచంద్ర, బొగ్గరపు శేషగిరిరావు, కౌన్సిలర్లు కె.నగేష్, సీహెచ్ చంద్ర, బుశెట్టి నాగేశ్వరరావు, నాగ అరుణ, రంగలక్ష్మమ్మ, వనజాక్షి, దుదేకుల ప్రసాద్, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, సలీం, మయూరి ఖాశీం, షెక్షావలి, కరీంసా, మహ్మద్, కరీముల్లా, రోజ్‌లీడియా, కరీం బాషా, యక్కలి నరేష్, రహంతుల్లా, వై.రంగయ్య, కొలగట్ల శివారెడ్డి పాల్గొన్నారు. అనంతరం కిట్లు పంపిణీ చేశారు.

## జిల్లా వైద్యశాలలో మొదటి టాన్సిల్ ఆపరేషన్


శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ రాంబాబు, లత

మార్కాపురం: పట్టణంలోని జిల్లా వైద్యశాలలో మొదటి టాన్సిల్ ఆపరేషన్‌ను విజయవంతంగా చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. జిల్లా వైద్యశాలలోనే డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్‌సింగ్‌కు గొంతులో గడ్డలు ఏర్పడి గురక, తరుచూ జ్వరం వస్తోంది. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఏర్పడింది. అతడు తీవ్రం ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ రాంబాబు, మత్తు వైద్య నిపుణురాలు లత కలిసి ఆపరేషన్ చేశారు. ఇదే ఆపరేషన్ ప్రైవేటు వైద్యశాలలో చేస్తే 30 నుంచి 40 వేల రూపాయలు ఖర్చు అవుతోందన్నారు. జిల్లా వైద్యశాలలో ఉచితంగా చేశామని డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు.

## వాటర్‌షెడ్ పనులతో గ్రామాభివృద్ధి

కొనకనమిట్ల: వాటర్ షెడ్ ద్వారా గ్రామాల్లో పనులు చేపట్టి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించనున్నట్లు ప్రాజెక్ట్ అధికారి సుధాకర్ చెప్పారు. మండలంలోని తువ్వపాడులో గ్రామాభివృద్ధిపై బుధవారం గ్రామసభ నిర్వహించి వాటర్ షెడ్ ఉపయోగాలు ప్రజలకు వివరించారు. చెరువులు, కుంటల అభివృద్ధి, పొలాలు, రహదారుల వెంట మొక్కలు నాటడం వంటి పనులు చేపట్టవచ్చన్నారు. వర్షం నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలు పెంపొందించడమే వాటర్ షెడ్ లక్ష్యమని సుధాకర్ అన్నారు. తొలుత గ్రామంలో చేపట్టే పనులకు వాటర్‌షెడ్ కమిటీ తీర్మానం చేసింది. వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ మోరా అరుణ శంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మందలపు శ్రీనివాసులురెడ్డి, టీఏ ఆనంద్ రాజు, సర్పంచ్ శిలువకుమారి, మాజీ సర్పంచ్ మోరా శంకర్‌రెడ్డి, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు ఇజ్రాయేల్, ఏసయ్య పాల్గొన్నారు.

# బాలికలు కష్టపడి చదవాలి


విద్యార్థినికి బహుమతులు అందిస్తున్న వైద్యాధికారులు

ముండ్లమూరు: విద్యార్థినులు చిన్నతనం నుంచే లక్ష్యంతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని వైద్యాధికారులు జ్యోతి, జాస్మిన్ అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు వారు బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలుసుకోవాలన్నారు. రాజ్యాంగం ప్రసాదించి హక్కులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసపత్రం, బహుమతులు అందజేశారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, మండల కమ్యూనిటీ మొబలైజర్ గోపనబోయిన వెంకట్రావు, ప్రిన్సిపాల్ ఆవుల సునీత పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని సలకలవీడులో రామలింగేశ్వరస్వామి శివలింగ ప్రతిష్ట సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచన, పంచగవ్య కూర్చపూజ, దీక్షా గ్రహణం, అంకురారోపణ, వాస్తు మండపారాధన, అఖండ దీపాస్థాపన, ప్రధాన దేవతా కలశస్థాపన, అగ్ని ప్రతిష్ట, జలాధివాసం పూజలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

# రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదు


తహసీల్దార్ దాసుకు వినతిపత్రం అందజేస్తున్న సింగుపల్లి గ్రామస్తులు

పుల్లలచెరువు: తమకు రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదని మండలంలోని సింగుపల్లి గ్రామవాసులు బుధవారం తహసీల్దార్ దాసుకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. సక్రమంగా రేషన్ సరకులు ఇవ్వాలని డీలర్‌ను అడిగితే దిక్కున్న చోట చెప్పుకోండని అంటున్నాడని, పెద్దలు ఎవరు లేని సమయంలో వచ్చి పిల్లలతో వేలిముద్రలు వేయించుకుని వెళ్తున్నాడని వివరించారు. మూడు నెలల నుంచి సరుకులు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ విషయమై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. దీనిపై తహసీల్దార్ స్పందింస్తూ.. ఆర్ఐ, వీఆర్వోతో విచారణ చేపట్టి డీలర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సచివాలయాల తనిఖీ


మందులు పరిశీలిస్తున్న పద్మజ

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి సచివాలయాలను జిల్లా వ్యాధి నిరోధక అధికారి పి.పద్మజ బుధవారం తనిఖీ చేశారు. పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. నిల్వ ఉన్న వ్యాక్సిన్‌ను పరిశీలించారు. ఆమె వెంట హెచ్ఈఓ కె.చంద్రశేఖరబాబు, సీహెచ్ఓ ఇన్యాసమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతిదేవి, ఎంఎల్‌హెచ్‌పీ శివకుమారి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

**కేజీబీవీ తనిఖీ..**

స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాలను జిల్లా వ్యాధి నిరోధక అధికారి పద్మజ తనిఖీ చేశారు. ఉపాధ్యాయినులతో మాట్లాడి బాలికలను ఆరోగ్యపరంగా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. వైద్యాధికారి సునీతకు పలు సూచనలు, సలహాలందించారు.

# యువ క్రీడాకారుల ప్రతిభకు 'సాక్షి' కృషి


విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

చీరాల: యువ క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు సాక్షి చేస్తున్న కృషి అభినందనీయమని చీరాల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.రవికుమార్ అన్నారు. సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జూనియర్స్ విభాగంలో చీరాల ఇంజినీరింగ్ కాలేజీ పాలిటెక్నిక్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ నిబంధనలతో అనుభవం కలిగిన అంపైర్లతో నిర్వహించిన ఈ టోర్నమెంట్ యువ క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చూపడానికి ఇది చక్కని వేదిక అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో మరిన్ని ప్రజా ప్రయోజన కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. పీడీ కె.శ్రీనివాసరావు, మహాలక్ష్మి, మణికంత, రామకృష్ణ పాల్గొన్నారు.

## అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

గిద్దలూరు రూరల్: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, విషయాన్ని వెంటనే తమకు చేరవేయాలని స్థానిక ఎస్ఐ బ్రహ్మనాయుడు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గిద్దలూరు ప్రాంతంలో ఇటీవల వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కొత్తవారు మీ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ కనిపిస్తే తక్షణమే సమాచారం అందించాలని సూచించారు.

# ఆలయ సంపదను పరిరక్షించుకోవాలి

యద్దనపూడి: సనాతన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ చారిత్రాత్మక సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావు అన్నారు. బుధవారం సాయత్రం మండలంలోని పూనూరు గ్రూపు దేవాలయాలను ఆయన సందర్శించారు. తొలుత గ్రామంలోని త్రిపురాంతకస్వామి, వేణుగోపాలస్వామి, చెరువును పరిశీలించారు. ఆలయం చుట్టూ వ్యర్థాలు ఉండటంతో వెంటనే తొలగించాలని అలాగే ఆలయం చుట్టూ సీసీ కెమెరాలను అమర్చాలని ఈఓ జ్యోతికుమారికి సూచించారు. అలాగే గత సంవత్సరం కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన రథానికి సంబంధించి రథశాల నిర్మాణానికి దాత రాటకొండ హనుమంతురావు రూ.6,70 లక్షల కాంట్రిబ్యూషన్ చెక్‌ను, అలాగే లక్ష రూపాయల విలువైన తొమ్మిది స్టాండ్ ఫ్యాన్లను సహాయ కమిషనర్ పానకాలరావు సమక్షంలో ఈఓ జ్యోతికి అందజేశారు. పూనూరు గ్రూపు దేవస్థానానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు ఖాతాలో ఉన్న దేవాదాయశాఖ నిధులను బ్యాంకు నుంచి డ్రా చేస్తున్నట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో ఆలయాల మాన్యం భూములకు సంబంధించిన కౌలు తాలుకా నగదు సకాలంలో వసూలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించారు. ఈఓను బకాయిలకు సంబంధించి తాకీదులు ఇచ్చినా స్పందించని వారిపై కోర్టులో వ్యాజ్యం ఎందుకు దాఖలు చేయలేదని ఈఓను ప్రశ్నించారు. గ్రామస్తులు పూర్తి స్థాయిలో కౌలు వసూలు చేయకుండా ఈఓ జ్యోతి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఆలయ నిధులు చాలా అవకతవకలకు పాల్పడినట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కొన్ని రికార్డులు ఆడిట్ కోసం పంపినట్లు తెలుసుకొని పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించి అవకతవకలకు పాల్పడితే సదరు ఈఓపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ దేవాదాయ శాఖకు సంబంధించి ఖాతాలున్న బ్యాంకు అధికారులకు అనుమతిపత్రం లేకుండా నగదు చెల్లించవద్దని బ్యాంకు అధికారులకు లేఖలు పంపనున్నట్లు తెలిపారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్, రికార్డు అసిస్టెంట్ రామకృష్ణ, ఆలయ అర్చకులున్నారు.

## వేలం పాట వాయిదా

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు చెరువులో చేపలు పెంచుకునేందుకు బుధవారం ఏర్పాటు చేయాల్సిన బహిరంగ వేలం పాటను అనుకున్న సంఖ్యలో పాటదారులు హాజరు కానందున వాయిదా వేసినట్లు ఈఓఆర్డీ ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రారంభ ధర ఎక్కువగా ఉండటం.. గిట్టుబాటుగాక పోవటంతో పాటలో పాల్గొనేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. దీంతో పాటను వాయిదా వేసినట్లు గ్రామ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం తెలిపినట్లు ఈఓఆర్డీ వివరించారు. తదుపరి పాట తేదీలను మరోసారి తెలియజేస్తామని పేర్కొన్నారు.

## ఈ-క్రాప్ నమోదుపై సూపర్ చెక్

తాళ్లూరు: రబీలో సాగు చేసిన పంటల ఈ–క్రాప్ నమోదుపై సూపర్ చెక్ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. బొద్దికూరపాడులో బుధవారం ఈ–క్రాప్ పంట నమోదును పరిశీలించారు. పంట నమోదు వివరాలు ఎటువంటి లోపాలు లేకుండా గ్రామ వ్యవసాయ సహాయకులు చూడాలని కోరారు. లోపాలు ఉంటే రైతులు సాంకేతిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. వృద్ధ రైతులు, అనారోగ్యంతో ఉన్న రైతులు, మృతి చెందిన వారి పేర్లపై ఉన్న భూములకు ఈ–క్రాప్‌ను ఆప్షన్ ఇచ్చిన వెంటనే కచ్చితమైన సమాచారంతో నమోదు చేయాలని కోరారు. వీఏఏ అజ్మీర్, సుష్మ పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలి

మార్కాపురం: బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిరసనగండ్ల శ్రీనివాసులు కోరారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తైతే నాలుగున్నర లక్షల ఎకరాల సాగు నీరు, 15 లక్షల మందికి తాగునీరు, మూడు జిల్లాల్లో శాశ్వతంగా కరువుపోతుందన్నారు. నిర్వాసితుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరారు. ప్రెస్ మీట్‌లో పట్టణ బీజేపీ అధ్యక్షుడు పి.రామచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, పార్టీ నాయకులు కంభం వెంకట రమణ, పీవీ కృష్ణారావు, శాసనాల సరోజిని, రామయ్య, మురళి పాల్గొన్నారు.

# తలశిలను పరామర్శించిన జంకె


స్వర్ణకుమారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి బుధవారం విజయవాడ వెళ్లి పరామర్శించారు. రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. జంకె వెంకటరెడ్డి రఘురామ్ ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రఘురామ్‌తో మాట్లాడి జంకె ధైర్యం చెప్పారు.

## వైద్యశాలను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు


పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తాళ్లూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విజిలెన్స్ ఎస్ఐ జి.నాగేశ్వరరావు, ఏఈ చిరంజీవిలు బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో అందిస్తున్న సేవల వివరాలు రోగులను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, ఫార్మసీ, పరిసరాలు పరిశీలించారు. నాడు– నేడు పనులు జరుగుతున్న తీరు, రికార్డులు పరిశీలించారు. నాడు–నేడు పనులు 50 శాతం మాత్రమే పూర్తయినట్లు గమనించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలు వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ వారికి వివరించారు.

# విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం


విద్యార్థినితో మాట్లాడుతున్న ఎంఈఓ

త్రిపురాంతకం: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అందరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని ఎంఈఓ కె తులసిమల్లికార్జుననాయక్ పేర్కొన్నారు. మండలంలోని సీహెచ్ తండలో పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల తరగతికి తగిన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. విద్యార్థుల పుస్తకాలు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

# ప్లాస్టిక్‌ను నిషేధించాలి


మాట్లాడుతున్న కార్యదర్శి కృష్ణమూర్తి

దొనకొండ: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించి ఆరోగ్యాలను కాపాడుకోవాలని సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్ సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన ప్లాస్టిక్ నివారణపై దుకాణదారులు, చిరు వ్యాపారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ విక్రయించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణదారులు, చిరువ్యాపారులు 18 మందిపై అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. పరిసరాలను కాపాడుకుంటూ పంచాయతీని అభివృద్ధి చేసుకోవాలని కార్యదర్శి పి.కృష్ణమూర్తి సూచించారు. దొనకొండలో పందులు, కుక్కలు, కోతులు ఎక్కువ సంచరిస్తున్నాయని, వెంటనే నివారణ చర్యలు తీసుకుంటే ఉత్తమ పంచాయతీగా పేరు ఉంటుందని వైస్ సర్పంచ్ ఇమ్రాన్‌ఖాన్ ఆకాంక్షించారు. వార్డు సభ్యులు, జెస్సీ గ్లోరీ పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ తనిఖీ


వైద్యశాలను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కొర్రప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. వైద్యశాలకు వచ్చే గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. గర్భిణులకు అవసరమైన ఐరన్ మాత్రలు, ఇతర మందులను క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నిధుల దుర్వినియోగంపై విచారణ


అధికారులతో చర్చిస్తున్న దర్శి సీఐ

తాళ్లూరు: మండలంలోని విఠలాపురం పంచాయతీలో ఉపాధి పనుల బిల్లుల చెల్లింపుల్లో జరిగిన నిధుల దుర్వినియోగంపై నమోదైన కేసులో బుధవారం దర్శి సీఐ రామకోటయ్య విచారణ చేపట్టారు. ఎంపీడీఓ కేవై కీర్తి, ఈఓఆర్డీ ప్రసన్నకుమార్‌తో కలిసి కేసు నమోదయ్యే వరకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఏఎస్ఐ మోహన్‌రావు ఆయన వెంట ఉన్నారు.

## ఎఫ్ఏ-3 పరీక్షల పరిశీలన


ఎఫ్ఏ-3 పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ

పుల్లలచెరువు: అన్ని యాజమాన్యాల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి క్లాస్ రూమ్ బేస్డ్(సీబీఏ) ఎఫ్ఏ-3 పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈఓ శామ్యూల్‌జాన్ తెలిపారు. బుధవారం నుంచి ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు నిర్వహిస్తుండగా.. నాయుడుపాలెం పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి ఓఎంఆర్ షీట్లను ఎంఈఓ కార్యాలయానికి పంపాలని సూచించారు. 12వ తేదీ లోగా మూల్యాంకనం పూర్తి చేసి, 14వ తేదీలోగా మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.